73)మలహరి

ప॥ ఏమి సేసేమిక నేము యెంతని దాచుకొందుము । నీమహిమ యింతింతననేరము నేమయ్యా ॥

చ॥ అందు నిన్ను నొకమాటు హరి యను నుడిగితె । పొందినపాతకమెల్లా బొలిసిపోయ ।
మందలించి మఱి యొకమాటు నుడిగినఫల- । మందె నీకప్పగించితి మదిగోవయ్యా ॥

చ॥ యిట్టె మీకు రెండుచేతులెత్తొకమాటు మొక్కితే । గట్టిగా నిహపరాలు గలిగె మాకు ।
దట్టముగ సాష్టాంగదండము వెట్టినఫల- । మట్టె నీమీద నున్నది అదిగోవయ్యా ॥

చ॥ సరుగ నీకొకమాటు శరణన్న మాత్రమున । సిరుల బుణ్యుడ నైతి శ్రీవేంకటేశ ।
ధరలోన నే నీకు దాసుడనైనఫల- । మరయ నీమీద నున్న దదిగోవయ్యా ॥